ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





నీరుగారిన ఉప్పు పరిశ్రమ !

● 8,648 ఎకరాల సాల్ట్ భూముల లీజును పునరుద్ధణ నిల్ ● 457 ఎకరాల్లోనే సాగు

● 3.15 లక్షల నుంచి క్రమేణా వెయ్యి టన్నులకు ఉత్పత్తి పరిమితం ● తీర ప్రాంత ప్రజల ఉపాధిపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో సముద్ర తీరంలో ఉప్పు (సాల్ట్) పరిశ్రమ నీరుగారిపోయింది. సాల్ట్ భూముల లీజును పునరుద్ధరించకపోవడం, చిన్న, సన్నకారు రైతులకు ఉత్పత్తి గిట్టుబాటు అవ్వకపోవడంతో ఉప్పు ఉత్పత్తులు దిగజారి పోయాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నం, కృత్తివెన్ను మండలాల్లో సముద్ర తీరప్రాంతానికి చెందిన 8,648.28 ఎకరాల్లోని సాల్ట్ భూముల్లో నాలుగేళ్ల క్రితం వరకు సగటున 3.15 లక్షల టన్నుల వరకు సాల్ట్ ఉత్పత్తులు వచ్చేవి. గత మూడేళ్లుగా ఉప్పు ఉత్పత్తులు క్రమేణా తగ్గిపోతున్నాయి. గత ఏడాది 1.40 లక్షల టన్నులకు ఉత్పత్తి పరిమితమైంది. ఈ ఏడాది 457.28 ఎకరాల్లో కేవలం వెయ్యి టన్నులు మాత్రమే ఉప్పు ఉత్పత్తి వస్తుందని కేంద్ర ప్రభుత్వ సాల్ట్ కంపెనీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు.

వేల ఎకరాల్లో ఉత్పత్తి నిలిపివేత : ఉపాధిపై ప్రభావం

మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెం సముద్రతీరంలో అత్యధికంగా 6,600 ఎకరాల్లో భారత్ సాల్ట్‌కు సంబంధించి భారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమలో గత ఏడాది 1.40 లక్షల ఉప్పు ఉత్పత్తి చేసింది. ప్రతి ఏటా డిసెంబర్ చివరి వారం నుంచి మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన గ్రామాలకు చెందిన వెయ్యి మందికిపైగా కార్మికులకు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి లభించేంది. బందరు పోర్టు నిర్మాణం నేపథ్యంలో ఈ భూముల్లో మెగా ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెబుతూ ప్రభుత్వం భారత్ సాల్ట్ భూముల లీజు పునరుద్ధరణను నిలిపివేసింది. దీంతో ఇక్కడ పనిచేసే వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈఒక్క ప్రాంతంలోనే కాదు... మూడేళ్ల వ్యవధిలో మంగినపూడిలో గోదావరి సాల్ట్ కంపెనీ 560 ఎకరాలు, వనమిరెడ్డి వెంకటేశ్వర్లు 338 ఎకరాలు, రోహిణి 4 ఎకరాలు, కృత్తివెన్ను మండలం చినపాండ్రేక ప్రాంతంలో ఇల్లూరి రాఘవయ్య కంపెనీ 60 ఎకరాలు, వనజ కుమారి 8 ఎకరాలు, ఉప్పాల రామకృష్ణ ప్రసాద్ 155 ఎకరాలు, శ్రీవాణి 70 ఎకరాల చొప్పున మొత్తం 7,795 ఎకరాల భూములకు ప్రభుత్వం లీజును పునరుద్ధరించలేదు. దీంతో ఈ భూముల్లో ఉప్పు ఉత్పత్తులు నిలిచిపోయాయి. ఇక్కడ పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయారు. వేసవిలోనూ వర్షాలు కురవడం, మార్కెటింగ్ సమస్యలు ఎదురవ్వడంతో మంగినపూడి వద్ద పేదలకు పంపిణీ చేసిన బిఫారం పట్టా భూములు 450 ఎకరాల్లోనూ ఈ ఏడాది పూర్తిగా ఉప్పు సాగును నిలిపివేశారు.

కేవలం 457 ఎకరాలకే పరిమితం

ఎంవి సాల్ట్ 333.28 ఎకరాలు, ఎఎన్‌విఎస్ మూర్తి కంపెనీ 124 ఎకరాలు మొత్తం 457 ఎకరాల్లో మాత్రమే ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి పరిమితమైంది. ఏప్రిల్, మేల్లోనూ చెదురుమదురు వర్షాలు కురవడంతో ఉప్పు ఉత్పత్తికి ప్రతికూలంగా మారింది. దీంతో కేవలం వెయ్యి టన్నులు మాత్రమే ఈ ఏడాది దిగుబడులు వస్తాయని కేంద్ర ప్రభుత్వ సాల్ట్ కంపెనీ అధికారులు అంచనా వేస్తున్నారు.

రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు



రుణ ప్రణాళిక అమలులో బ్యాంకులే కీలకం

● జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

● రూ.83,500 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా సంక్షేమం, ఆర్థిక ప్రగతి, సమగ్రాభివద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.83,500 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక (ఎసిపి) లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు బ్యాంకులు కృషి చేయాలన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ (డిసిసి), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ (డిఎల్ఆర్‌సి) సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్... కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశతో కలిసి (మిగతా 2లో)

విమానాశ్రయం, హెల్త్ వర్సిటీ తరలింపునకు కుట్ర

● వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్

● విజయవాడ బ్రాండ్‌ను నాశనం చేస్తే సహించబోమని హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :




విజయవాడ (గన్నవరం) విమానాశ్రయాన్ని, హెల్త్ యూనివర్సిటీని అమరావతికి తరలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ అమరావతి పేరుతో విజయవాడ బ్రాండ్‌ను నాశనం చేస్తుంటే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. విజయవాడ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చడానికి ఒక టెర్మినల్ నిర్మాణం పూర్తయిందని, రెండో టెర్మినల్ కోసం రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. విమానాశ్రయం అభివృద్ధికి రైతుల నుండి వేలాది ఎకరాల భూమిని సేకరించారని గుర్తుచేశారు. ఇప్పుడు అమరావతిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో విజయవాడ విమానాశ్రయాన్ని మూసేయాలనే (మిగతా 2లో)

19న తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - తిరువూరు : కలెక్టర్ ఉత్వరుల మేరకు ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఇన్చార్జి కమిషనర్, మేనేజర్ ఎస్.వి.రామారావు తెలిపారు. 15న కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి రాజీనామాను గత నెలలో జరిగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారని, దీన్ని కలెక్టర్‌కు పంపామని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తిరువూరుతోపాటు కర్నూల్ జిల్లా ఆందోని, విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ చైర్మన్, సత్యసాయి జిల్లా కదిరి మున్సిపల్ ఛైర్మెన్, ఇద్దరు వైస్ చైర్మన్ల ఎన్నికకు ఈనెల 19న నిర్వహిస్తున్నారని తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ రేసులో వైసిపికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ ఉన్నారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లకుగాను వైసిపికి 17 మంది, టిడిపికి ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఈ నేపథ్యంలో మోదుగు ప్రసాద్ ఎన్నికావడంతో లాంఛనీయమేనని భావిస్తున్నారు.

విక్రయానికి వరి విత్తనాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానంలో అధిక దిగుబడులు ఇచ్చే వరి విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ నాగేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసియు 100 రకం ఫౌండేషన్ సీడ్ కిలో రూ.42, ఎంసిఎం 103 రకం ఫౌండేషన్ సీడ్ కిలో రూ.47, ఎంసిఎం 125 రకం కిలో రూ.50కి, ఎల్‌బిజి 8844 మినుము కిలో రూ.150కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలను ఉపయోగించుకుని రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని, విత్తనాలు అవసరమైన రైతులు 9440853096 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


ఎంపి కేశినేని శివనాథ్‌ను సత్కరిస్తున్న క్రెడాయ్ సభ్యులు

పారిశ్రామిక అభివృద్ధిపై క్రెడాయ్ చర్చ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని గురునానక్ కాలనీలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం క్రెడాయ్ క్రౌనింగ్ ది టార్చ్ బేరర్ 2025-2027 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రతినియోజకవర్గం పారిశ్రామికంగా అభివద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కషిచేస్తోందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. త్వరలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ హబ్ రానుందన్నారు. బందర్‌లో డిఫెన్స్ ఇండస్ట్రీతోపాటు బందర్ పోర్ట్ కూడా రానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ జి.రామిరెడ్డి, క్రెడాయ్ ఎపి ప్రెసిడెంట్ బాయన శ్రీనివాసరావు, క్రెడాయ్ ఎపి జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబులతో పాటు క్రెడాయ్ సభ్యులందరూ పాల్గొన్నారు.

సిఎమ్‌డిని కలిసిన యుఇఇయు నేతలు

విజయవాడ : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు-సిఐటియు) ఎపిసిపిడిసిఎల్ కమిటీ నాయకులు మంగళవారం విజయవాడలోని సిఎమ్‌డి పి.పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్ట్సు డైరెక్టర్ టి.వి.ఎస్.ఎస్.మూర్తిని కలిశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిస్కం అధ్యక్ష కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజు, డిస్కం నాయకులు ఎం.సి.హెచ్.వీరాంజనేయులు, జె.అనిల్ కుమార్, ఎం.సుబ్బారెడ్డి, జె.కనకలింగేశ్వరావు, ఆచారి, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు. డిస్కం పరిధిలో జెఎల్‌ఎం గ్రేడ్ -2, ఇపిఎఫ్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్, సర్కిల్లో విభజనలో ఉద్యోగులు విభజన, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజినీర్ అపాయింట్మెంట్ బై ట్రాన్స్ఫర్, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.




మీడియాతో మాట్లాడుతున్న ఎంపి శివనాథ్, ఎంఎల్‌ఎ గద్దె

ఎన్టీఆర్ సర్కిల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట ఎన్టీఆర్ సర్కిల్ ఆధునీకరణ పనులకు మంగళవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పటమట ఎన్టీఆర్ సర్కిల్‌ను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్రా కిషోర్, చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, కార్పొరేటర్లు ముమ్మినేని ప్రసాద్, జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పుల్లేటి డ్రైన్, రోడ్డు విస్తరణకు సహకరించాలి

అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు

ప్రజాశక్తి-విజయవాడ : పుల్లేటి డ్రైన్ నిర్మాణంతోపాటు రోడ్డు విస్తరణ పనులకు స్థానిక నివాసులు సహకరించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి) మోహన్‌బాబు కోరారు. పుల్లేటి డ్రైన్ నిర్మాణం, 60 అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక నివాసులతో ఎసిపి తన ఛాంబర్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత ప్రజలకు ప్రభుత్వ పరంగా తగిన సాయం అందిస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ సూపర్వైజర్ మతిన్, ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.


స్థానిక నివాసులతో చర్చిస్తున్న ఎసిపి మోహన్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : నూటికి నూరు శాతం రెవెన్యూ వసూళ్లు అయ్యేటట్లు సంబంధిత అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది దృష్టి పెట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నూతన భవనంలోని మీటింగ్ హాల్లో రెవెన్యూ సమీక్ష సమావేశం జరిగింది. ఈసమావేశంలో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, శర్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డ్ అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్విమ్మర్లకు విఎంసి కమిషనర్ అభినందన

ప్రజాశక్తి-విజయవాడ : ఖేలో ఇండియా -2025 యూత్ గేమ్స్‌లో అత్యంత ప్రతిభ కనపరిచి, విజయం సాధించడంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన పలువురు స్విమ్మర్లను నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం అభినందించారు. ఖేలో ఇండియా ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం తృతీయ స్థానంలో నిలవడంతో కీలకపాత్ర పోషించిన అండర్-18 స్విమ్మర్లు తీర్థ సామదేవ్, దేవ గణేష్, యజ్ఞ సాయి విఎంసి ప్రధాన కార్యాలయంలో ధ్యానచంద్రను కలిశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ డాక్టర్ లత, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీలు ఐ.రమేష్, వి.వినోద్, సహాయక కోచ్ నితీష్ పాల్గొన్నారు.

డ్రైన్లలో తాగునీటి పైప్‌లైన్లు తొలగించాలి

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 30 డివిజన్ దేవీనగర్, జివిఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ద్విచక్ర వాహనంపై పర్యటించారు. డ్రెయిన్లలో తాగునీటిని సరఫరా చేసేపైప్‌లైన్లు తొలగించాలని ఆయన ఆదేశించారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ఎపిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్షులు పివి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయు ఆధ్వర్యంలో పిఎన్ బస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఎంయు రాష్ట్ర, జిల్లా నాయకులు రావి సుబ్బారావు, ఎన్.హనుమంతరావు, అయ్యప్ప, మోహన్, డివిరావు, సిహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి (ఆర్‌ఎం) ఎంవై దానంకు వినతిపత్రం అందజేశారు.



కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరువూరు

స్థానిక సుందరయ్య కాలనీలో మంగళవారం కిడ్నీ వ్యాధితో మంగళగిరి దుర్గారావు (58) మృతిచెందాడు. మృతుడు తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. మూడు రోజుల క్రితం పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద మృతిచెందాడు. మతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు గత నెలలోనే వివాహమైంది. దుర్గారావు కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

రుణ ప్రణాళిక అమలులో బ్యాంకులే కీలకం

2025-26 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. గత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో వివిధ బ్యాంకుల పాత్ర, బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన కీలక సూచికల్లో ప్రగతి, ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ రుణాలు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు తదితరాలను పిపిటి ద్వారా వివరించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రంగానికి రూ.13,500 కోట్లు, ఎంఎస్‌ఎంఇ రంగానికి రూ.17 వేల కోట్లు రుణ లక్ష్యాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ప్రాధాన్యరంగానికి రూ.33 వేల కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.50,500 కోట్ల మేర లక్ష్యాలను రుణ ప్రణాళికలో పొందుపరిచినట్లు వివరించారు. ఇతర ప్రాధాన్య రంగానికి రూ.2,495 కోట్ల రుణాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. గతేడాది రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనలో బ్యాంకులు మంచి ప్రగతి కనబరిచాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ బ్యాంకులు మరింత కీలకంగా వ్యవహరించి, లక్ష్యాలను చేరుకునేందుకు కషిచేయాలన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఈ ఏడాది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.855 కోట్ల మేర జీవనోపాధి రుణాలు మంజూరు చేస్తున్నామని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అన్నారు. ఈకార్యక్రమంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) జిల్లా ప్రాధాన్యత రంగానికి సంబంధించి దాదాపు రూ.30 వేల 48 కోట్లతో పొటన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పిఎల్‌పి)ను కూడా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్‌బీఐ ఎల్‌డీవో సీహెచ్ నవీన్ కుమార్, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆర్‌సేతి డైరెక్టర్ అమరేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, టిడ్కో ఈఈ చిన్నోడు, డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.కిరణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయం, హెల్త్ వర్సిటీ తరలింపునకు కుట్ర

కుట్ర పన్నారని ఆరోపించారు. అలా చేస్తే విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు ఏం సమాధానం చెబుతారని, వారికి ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. దాదాపు 16 లక్షల మంది జనాభా ఉన్న విజయవాడ నగర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలంలోని ఐదు గ్రామాల ప్రజలను భయపెట్టి స్పోర్ట్స్ సిటీ పేరుతో భూములను లాక్కోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో క్రషర్స్ బిజినెస్ ఎక్కువగా నడుస్తుందని, స్పోర్ట్స్ సిటీ వస్తే ఈ వ్యాపారం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదైనా విజయవాడ నగరంలో చెప్పుకోవడానికి ఒక్క అభివద్ధి కార్యక్రమం కూడా జరగలేదన్నారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని, స్మృతివనాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ నెల 22వ తేదీ నాటికి 910 ఇళ్ళు పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలోనే చాలా వెనుకబడి ఉండటంతో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ నెల 16వ తేదీన జిల్లా కలెక్టర్ సమీక్షించినప్పుడు ఆర్. సి (రూఫ్ క్యాస్టింగ్) స్థాయిలో 506 గహాలు, ఆర్.ఎల్. (పై కప్పు) స్థాయిలో 2,033 గహాలు ఉన్నాయన్నారు.ఇప్పుడు పురోగతి పరిశీలిస్తే కేవలం 237 గహాలు మాత్రమే పూర్తి చేయడం సరికాదన్నారు. ఇకనైనా ప్రత్యేక అధికారులు, ఎంపిడీవోలు, మున్సిపల్ కమిషనర్లు గహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువ పెండింగ్లో ఉన్న లేఅవుట్లలో లబ్ధిదారులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశాలు నిర్వహించి ఈనెల 22వ తేదీలోగా 910 గహాలు పూర్తిచేసేలా వారిని ప్రోత్సహించాలన్నారు. అదనపు ఆర్థిక సహాయం ఎస్సీలకు 75 వేలు, బిసి, ఎస్టిలకు 50 వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ సరైన పురోగతి లేకపోవడం విచారకరమన్నారు.జిల్లాకు 13 కోట్ల రూపాయలు అదనపు ఆర్థిక సహాయం కింద నిధులు విడుదలైనప్పటికీ ఇప్పటివరకు కేవలం 72 లక్షల రూపాయలు మాత్రమే వినియోగించుకోవడం జరిగిందన్నారు.క్షేత్రస్థాయిలో చాలామంది ఎంపిడీవోలు మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షలు సరిగా నిర్వహించలేదని, 80 శాతం మంది ఇంజనీరింగ్ సహాయకులు ఏమి పనిచేయడం లేదని తెలుస్తుందని, అందువల్లనే సరైన పురోగతి సాధించ లేదన్నారు.రాష్ట్ర సచివాలయం నుండి ఉన్నతాధికారులు 15 రోజులకు ఒకసారి జిల్లాల పురోగతిపై సమీక్షిస్తున్నారని జిల్లా మిగిలిన అంశాలలో పురోగతి సాధిస్తున్నప్పటికీ గహ నిర్మాణంలో వెనకబడి పోవడంతో వారికి సమాధానం చెప్పడంలో చాలా ఇబ్బంది కలుగుతుందన్నారు.ఇకపై క్షేత్రాధికారులు వారానికి మూడుసార్లు గహ నిర్మాణంపై ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షలు నిర్వహించి మంచి పురోగతి సాధించాలన్నారు. అంతేకాకుండా తాను కూడా ఇకపై గహ నిర్మాణంలో పురోగతి సాధించేంతవరకు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు .ఇకనైనా మంచి పనితీరు కనపరచకపోతే అందుకు బాధ్యులైన వారిపై సస్పెన్షన్ వంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గహ నిర్మాణం లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసి అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కషి చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా గహ నిర్మాణ అధికారి వెంకటరావు, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ వాణి, ఏపీఎంఐపీ పిడి విజయలక్ష్మి, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహరు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై పోరాటాలు

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



ఆశా వర్కర్లను పరామర్శిస్తున్న సుబ్బరావమ్మ, నాయకులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: అంగన్వాడీ వర్కర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మధుసూదన్రావు శ్రామిక భవనంలో అంగన్వాడి వర్కర్ల సమావేశం జరిగింది. అర్బన్ ఏరియాలో అంగన్వాడీ టీచర్లకు ఇస్తున్న 12 వేల రూపాయలు జీతాన్ని 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ సంక్షేమ పథకాలకు నోచుకోకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్వాడి వర్కర్లను కూడా సంక్షేమ పథకాలకు అర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కనీసవ వేతనాల కోసం జిల్లాలోని అంగన్వాడి వర్కర్లు, ఆయాలు ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశ వర్కర్లను సుబ్బరావమ్మ మంగళవారం పరామర్శించారు. గాయపడ్డ ఆశ వర్కర్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు విజ్ఞప్తి చేశారు. భుజం జారిపోయి బాధపడుతున్న శాఖమూరి శ్రీవాణికు గురువారం ఆపరేషన్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగత రమాదేవి, సిఐటియు మండల కార్యదర్శి చిరువోలు జయరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పురిటిపాడు అంగన్వాడి కేంద్రాల్లో బాలల హక్కుల రక్షణ, ఫోక్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పిల్లలకు సంబంధించిన నాలుగు చట్టాల గురించి వివరించారు. ఫోక్స్ చట్టం లోని బాలల లైంగిక వేధింపులు నిర్మూలించడానికి ఫోక్స్ చట్టం అమలులోకి వచ్చిందని దీని ఉద్దేశం 18 సంవత్సరాల లోపు పిల్లలపై జరిగే లైంగిక దాడులు జరిగిన ఎడల 20 సంవత్సరాలు గేలి శిక్ష లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షరాలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ఉంగుటూరు:** కిశోర బాలికల ఎదుగుదలపై అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి పద్మా దేవి అన్నారు. కిశోర్ బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఆత్కూరు మోడల్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా దేవి మాట్లాడుతూ కిశోర్ బాలికల ఆరోగ్యం, విద్య పట్ల బాధ్యతగా ఉండాలని, అదే క్రమంలో వ్యక్తిగత శుభ్రత చాలా కీలకమైందని అన్నారు. బాలికల ఎదుగుదలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని బాలికలపై నిరంతరం జరుగుతున్న అకత్యాలను గమనిస్తుండాలని, అక్రమ రవాణా పట్ల అనునిత్యం అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిరీష, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.మంగమ్మ,కె నాగమల్లేశ్వరి, కిశోర్ బాలికలు పాల్గొన్నారు. **కంకిపాడు:** పెనమలూరు మండలం గోసాల, వణుకూరు, గంగూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలలో కిషోర వికాసం- సమ్మర్ క్యాంపులో భాగంగా చైల్డ్ రైట్స్ మరియు చైల్డ్ ప్రొటెక్షన్ గురించి మహిళా కార్యదర్శి వికల్ప అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యానికేతన్ టీచర్ భారతి పాల్గొన్నారు. **ఉయ్యూరు:** బాలల హక్కులు బాలల సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కాటూరు మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష సూచించారు కాటూరు అంగన్వాడి కేంద్రంలో జరిగిన కిషోరి వికాసం వేసవి శిక్షణ తరగతుల భాగంగా బాల బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు.



గుడ్లవల్లేరులో...



ఘంటసాలలో...

ఘంటసాల: మండల పరిధిలోని దేవరకోట గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సమ్మర్ క్లాసులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ టి.రమా నాగమణి కిషోరి బాలల హక్కుల గురించి, బాల్య వివాహాలు, సోషల్ మీడియా పట్ల ఎలా జాగ్రత్త కలిగి ఉండాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఐసిపిఎస్ నుంచి సిహెచ్.నాగభవాని, ఈ.చంద్రమ్మ, జి.ఎం.ఎస్.కేలు మాధురి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. **నందివాడ:** మండలంలోని పెదలింగాల గ్రామంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్పై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్.నాగశిరీషా మాట్లాడుతూ పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను వివరించారు. పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచితుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బి. లక్ష్మీ అనూష,జి. వెంకటేశ్వరమ్మ, జి. చిట్టెమ్మ, డి.లక్ష్మీ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వక్కలగడ్డ క్రిమినల్ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు సంవత్సరాల క్రితం వక్కలగడ్డ గ్రామంలో జరిగిన పరస్పర క్రిమినల్ కేసుల్లో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కాకపోవటంతో రెండు కేసులు కొట్టివేస్తూ జిల్లా ఆరవ అదనపు జిల్లా జడ్జి పి. పాండురంగారెడ్డి మచిలీపట్నంలో మంగళవారం తీర్పులు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గూడూరుకు చెందిన జి పవన్ కుమార్(35) మచిలీపట్నం ఇంగ్లీష్ పాలెం చెందిన ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్గా పనిచేస్తున్న మాగంటి నాగలక్ష్మి(28) అనే యువతీతో ఐదు సంవత్సరాల క్రితం మచిలీపట్నం లో ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులను పలకరించడానికి వచ్చి ఇరువురి మధ్య సినీ పక్కిలో ప్రేమ ప్రారంభమైంది. కొంతకాలం కలిసి తిరిగారు. 2020 మే 24వ తేదీన పవన్ కుమార్ నాగలక్ష్మి కలిసి చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలో ఒక గదిలో ఉండి ఇరువురి మధ్య వచ్చిన పరస్పర గొడవలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువురి పరస్పర ఫిర్యాదులు మేరకు మాగంటి నాగలక్ష్మిపై హత్యాయత్నం కేసు, పవన్ కుమార్పై ప్రేమ పేరుతో వంచించాడని క్రిమినల్ కేసును అప్పటి చల్లపల్లి ఎస్సై పి.నాగరాజు రెండు కేసులను నమోదు చేశారు. కేసు విచారణలో నిందితులపై తగిన సాక్షాదారాలు లేకపోవడంతో ఇద్దరిపై కేసులు కొట్టివేస్తూ న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి తీర్పులు చెప్పారు. నిందితుల తరపున లంకిశెట్టి బాలాజీ, పేర్ని సురేష్, జొన్నల వెంకట నాగరాజు న్యాయవాదులుగా వ్యవహరించారు.


ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం: కేసరపల్లి గ్రామానికి చెందిన పలగాని నాగమల్లేశ్వరరావు విజయలక్ష్మి దంపతులు, ఈడే వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి మనవడు పలగాని సాత్విక్ కల్యన దంపతుల చేతులు మీదగా స్వామివారి దేవాలయం నిర్మాణమునకు 1,01,116 రూపాయలను విరాళంగా అందించారు. ఈ విరాళం మొత్తంను కమిటీ సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు.



ల్యాబ్ పరికరాలు వితరణ

ప్రజాశక్తి-గుడివాడ : శ్రీకష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో లయన్ ఉప్పల వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రద్యుమ్నబాబు స్థానిక రాజేంద్రనగర్లో గల ఎస్జిఆర్కె(టౌన్) మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే సైన్స్ ల్యాబ్ పరికరాలు, రెండు ఐరన్ బీరువాలను అందజేశారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, శ్రీకష్ణ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ పల్లపోతు వెంకట నాగబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పాడి రైతులకు సబ్సిడీ దాణా పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం పామర్రులోని పశువుల హాస్పిటల్ లో పాడిపశువుల రైతులకు సబ్సిడీ మీద పశువుల దాణా కట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలలో ఉన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలోకృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ , జనసేనపార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ , పశువైద్యశాల సిబ్బంది తదితరులుపాల్గొన్నారు. అనంతరం పామర్రు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండల స్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పామర్రు మండలం, పెదపారుపూడి మండలం విద్యార్థులకు వర్ల కుమార్ రాజా తన చేతుల మీదగా బహుమతులు అందజేశారు.





మాధురి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ : చందర్లపాడు మండలం విభరింతలపాడు గ్రామంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఉపాధి కూలీ అబ్బూరి మాధురి మృతదేహాన్ని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య సోమవారం పరిశీలించారు. మాధురి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నందిగామ పట్టణం మార్చురీలో సోమవారం మధ్యాహ్నం మాధురి మృతదేహాన్ని పరిశీలించి సంతాపం తెలిపారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.



దేవస్థానం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై చేపట్టిన నిర్మాణపనులు త్వరగా పూర్తి చేయాలని, యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం సాకారం చేయాలని ఆలయ ఇఒ వి.కె.శీనానాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మల్లేశ్వరస్వామి ఆలయంలో చేపట్టవలసిన మిగతా అభివృద్ధి పనులు, నవగ్రహ మండపం ప్రారంభానికి తీసుకోవలసిన చర్యలు, నూతన యాగశాల, నూతన పూజా మండపాలు అందుబాటులోకి తీసుకురావడం గురించి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మల్లేశ్వరస్వామి ఆలయం చుట్టు పక్కల పచ్చదనం పెంపొందించడం, సుందరీకరణ పనులు చేపట్టడం వంటివి చేయాలని ఆదేశించారు. దాత సహాయంతో నిర్మించిన యాగశాల మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పూజా మండపం రెండో అంతస్తుపైకి ఎక్కి పరిశీలించారు. పూజా మండపం ప్లాన్ చూసి, పూర్తయిన పనుల వివరాలు తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లతో సంప్రదించి, పురోగతి చూపించాలని, అభివృద్ధి పనులపై రోజువారీగా క్షేత్రస్థాయి సమీక్ష అవసరమని కార్యనిర్వహణాధికారి పేర్కొన్నారు.

తుది దశకు చేరిన ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - గంపలగూడెం : టౌన్ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం-1లో ధాన్యం కొనుగోలు దాదాపు తుదకు చేరినట్లు అగ్రికల్చరల్ అసిస్టెంట్ గంటా ప్రతాప్ తెలిపారు. ఈ ఏడాది సేవా కేంద్ర పరిధిలో 147 మంది రైతులకు గానూ 10,513 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ప్రతి క్వింటాకు 23,20 రూపాయల ధర చొప్పున రూ.2.43,920 లు ఆయా రైతుల ఎకౌంట్లో జమ అయినట్లు చెప్పారు. చెదురు మదురు రైతుల వద్ద 500 నుండి 600 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే ఉన్నట్లు తెలియజేస్తూ, వీటిని సైతం మరో రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ప్రతాప్ వివరించారు. మొత్తం మీద ఈ ఏడాది సంచుల కొరతతో కొనుగోళ్లలో కొంత జాప్యం ఏర్పడిందన్న మాట వాస్తవమని, మిగిలిన అన్ని అంశాల్లో రైతులకు సమస్యలు తలెత్తలేదని వివరించారు.



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఎడ్ల పందేల పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపి చిన్ని, ఎంఎల్‌ఎలు సౌమ్య, వసంత

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరుణాల మహోత్సవాలు జరుగుతున్నాయి. తిరునాళ్ళ సందర్భంగా ఎడ్లు బలప్రదర్శనను విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సోమవారం రాత్రి ప్రారంభించారు. నందిగామ మండలం లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలు ఆసక్తిగా సాగుతున్నాయి. ముందుగా నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వృషభరాజముల బలప్రదర్శన, బండ్ల లాగుడు పోటీలు తిలకించారు. 12న రెండు పళ్ల సైజు ఎద్దుల ప్రదర్శన, 13న నాలుగు పళ్ల సైజు, 14న ఆరు పళ్ల సైజు, 15న క్యూ కేటగిరి సైజు, 16న జూనియర్స్ సైజు ప్రదర్శన, 17న సీనియర్స్ సైజు ప్రదర్శన పోటీలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్‌ఎ కృష్ణప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తిరునాళ్ళ నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు. స్థానికులు, సందర్శకులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ళ సాయి, ఆలయ కార్యనిర్వహణాధికారి నారాయణ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల మాక్ డ్రిల్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : భారత్ పాకిస్థాన్‌ల మధ్య తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో యన్.టి.ఆర్. జిల్లా సబ్ కలెక్టర్ కె.చైతన్య ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ సర్వీస్ బిల్డింగ్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో ఏదైనా అనుకోని ప్రమాదకర సంఘటనలు జరిగినప్పుడు ఉద్యోగులు ఏవిధంగా వ్యవహరించాలి, ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవాలి, తోటివారు ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఏవిధంగా రక్షించాలి, పూర్తి రక్షణ కలిగిన ప్రాంతంలో వెళ్లి పరిస్థితులు చక్కబడే వరకు జాగ్రతలు వహించడం లాంటి చర్యలు తీసుకునే విధానం గూర్చి వివరించారు. రక్షణ చర్యలు ఎలా చేపట్టాలో ప్రత్యక్షంగా చూపించడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం స్థానిక పోలీస్, రెవెన్యూ, హాస్పిటల్ సిబ్బంది, ఎన్‌టిటిపిఎస్ ఫైర్, రక్షణ, ఎస్‌పిఎఫ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్ ఎస్.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు దానిని ఎలా ఎదుర్కోవాలో చూపించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్, ఓ అండ్ యమ్, డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ పి.శివ రామాంజనేయులు, ఫైర్ మాక్ డ్రిల్‌లో ఎ.డి.యఫ్.ఓ., కె.వినయ్, ఫైర్ ఆఫీసర్, మైలవరం, గౌతమ్, సిబ్బంది, ఆర్.ఐ. కె.వెంకటేశ్వర్లు, ఆర్.యస్.ఐ. వి.సుధాకర్, మెడికల్ ఆఫీసర్, ఇబ్రహీంపట్నం, డా. సయ్యద్ పరిహీన్, వారి సిబ్బంది. పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

గంపలగూడెం : అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతిని (మాక్ డ్రిల్) ప్రయోగాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. తిరువూరు ఫైర్ సిబ్బంది తోటమాల విగ్రహాల సెంటర్లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, పిడుగులు, ప్రమాదాలు ఏర్పడే సందర్భాల్లో, వాటిని నివారించి ఎలా తప్పించుకోవాలో తిరువూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ రాంబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, ఎంపిడిఓ పివిఎస్ నాగేశ్వరరావు, ఆర్ఐ వీరభద్రరావు, స్థానిక పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



గంపలగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అన్నదానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 100 రోజుల చలివేంద్రం వద్ద మంగళవారం ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు బాజీ జగ్గయ్యపేట ఎఎంసి చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్రరావు సతీమణి పద్మావతి జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. వారి కుమారుడు మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు సహకారంతో రవ్వ కేసరి స్వీట్, ఆవకాయ అన్నం, సాంబారు అన్నం, పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్య వైశ్య సంఘం వర్తక వాణిజ్య విభాగం చైర్మన్ కొత్తా పురుషోత్తం, మాజీ ఏఎంసీ చైర్మన్ మానేపల్లి నాగ బ్రహ్మం, జిల్లా వాసవి సేవాసమితి గౌరవాధ్యక్షులు పేరూరి నరసింహా రావు, జిల్లా మహిళా వాసవి సేవా సమితి అధ్యక్షురాలు వాసా నాగ మణి, జిల్లా వాసవి సేవా సమితి అధ్యక్ష, కోశాధికారులు యన్నాకుల రాంబాబు, కంభంపాటి రవి కుమార్, ఏపిఎంపిఏ నియోజకవర్గ జర్న లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్ పాల్గొని పంపిణీ చేశారు.

హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలి

జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట హెల్మెట్ల ధరించి ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్యంస్థానం చేరవచ్చని జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని బలుసుపాడు సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెల్మెట్లు ధరించడం అనేది ద్విచక్ర వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం ఎంతో నష్టపోతుందని, సెల్‌ఫోన్‌లకు ఇచ్చేలా ప్రాధాన్యత నేటి యువత హెల్మెట్లకు ఇవ్వకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్‌లు భద్రంగా చూసుకుంటారని ప్రాణాలకు మాత్రం విలువ ఇవ్వరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ధరించడంతోపాటు వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటివి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

జవాన్ మురళీకి నివాళి

ప్రజాశక్తి - వత్సవాయి : భారత్- పాకిస్తాన్ యుద్ధంలో అమరుడైన శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి స్థానిక చెరువు కట్ట వద్ద బజార్‌లోని రావి చెట్టు వద్ద ఘన నివాళు లర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాణావతి జగ్గయ్య, ఇస్లావత్ గణపతి, నాయకులు రమేష్, అంజి, జగదీష్ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎండాకాలం పశువులకు మేత, దాణా అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లిలో పశువులు దాణాను పశువుల కాపరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.పూర్ణిమ పాల్గొన్నారు.

సైనికుల సాహసాలను ప్రజలు మర్చిపోరు

ప్రజాశక్తి - నందిగామ : పహల్గంపై దాడి చేసి, అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై ప్రతీకార చర్యగా శత్రు స్థావరాలను అంతం చేసిన భారత సైనికుల ధైర్యసాహసాలను ప్రజలు మర్చిపోరని నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ మృతిచెందిన సైనికుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, యుద్ధంలో పాల్గొన్న సైనికులందరికీ ప్రత్యేక బోనస్ ప్రకటించాలని కోరారు.

కేర్ అండ్ షేర్ ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న 2005-2006 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల్లో ఒకరైన వర ప్రసాద్ మాస్టర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కృష్ణవేణి విజయవాడలోని కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్ట్‌లో వాలంటీర్‌గా వర్క్ చేస్తుంది. అక్కడ చాలామంది అనాథ పిల్లలున్నారని, పోషణ కష్టంగా ఉందని తనకు తెలిపిందన్నారు. ఈ విషయం పూర్వ విద్యార్థులకు తెలుపగా రూ.14,500 లు సేకరించారన్నారు. ఈ డబ్బును విజయవాడ కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్ట్‌కు అందజేసినట్లు తెలిపారు.

సారా విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎనిమిది మంది నేరస్తులను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. గతంలో కాపుసారా, తయారీ, విక్రయాలకు పాల్పడుతూ కేసుల్లో ఉండి అరెస్టు కానీ భూక్యా సుక్కో, ధరావత్తు రాము, తేళ్ళూరి నాగరాజు, బాణావతు కోటేశ్వరరావు, జోనిబోయిన కృష్ణ, అంగోతు తిరుపతమ్మ, ధారావతు రమేష్, గుజ్జర్ల వెంకటేశ్వరరావును అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి నూజివీడు సబ్ జైలుకు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.



20న సమ్మెను జయప్రదం చేయాలి


మొవ్వలో నోటీసు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మొవ్వ: ఈ నెల 20వ తేదీ నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు కార్మికులకు అనుమతి ఇవ్వాలని మొవ్వలోని జయలక్ష్మి సీ ఫుడ్స్ మేనేజర్ ధనుంజయకు మంగళవారం సిఐటియు నాయకులు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేందుకు దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో కార్మికులు పాల్గొనాలని


కంకిపాడులో...

పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే సంఘం పెట్టే హక్కు కార్మికుల కోల్పోతారని వివరించారు. కార్మికులకు కష్టకాలంలో వినియోగించే సమ్మె హక్కును రద్దు చేయడం ప్రమాదకరమైందని తెలిపారు. నేడు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. చట్ట ప్రకారం శాశ్వత కార్మికులు చేసే పనికి కాంటాక్ట్ కార్మికులు చేస్తే వారికి శాశ్వత కార్మికులకు ఇచ్చే వేతనాలు, అలవెన్స్, బెనిఫిట్‌లు ఇవ్వాలన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఒడుగు గంగాధర్, మహమ్మద్ కరీముల్లా, సిఐటియు మండల అధ్యక్షులు సిహెచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **మొవ్వ:** ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మొవ్వలో మంగళవారం సిఐటియు మండల అధ్యక్షురాలు రాజారత్నం అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. 20న కూచిపూడిలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఒడుగు గంగాధర్ ప్రసాద్, కాకి రాజశేఖర్, కొడాలి శ్రీనివాసరావు, దేవామణి, ఏనుగు శ్రీనివాసరావు, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, బొల్లా సుబ్రహ్మణ్యేశ్వర రావు, మద్దాల నాగభూషణం, శీలం నారాయణరావు, కొడాలి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు:** పామర్రు పంచాయతీ పారిశుధ్య కార్మికులు శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి ఓ గంగాధర్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వల్ల కార్మిక హక్కులు హరించబడతాయన్నారు. 2015, 2023లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న సమ్మె నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు విశ్వనాథం, శివ తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు కోరారు. మండేపూడి నాగభూషణరెడ్డి భవన్‌లో ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కుమారి, నరేష్, నళినికుమారి, శివశంకర్, దుర్గారావు, జాన్ మోజేశ్, రవి పాల్గొన్నారు.


పామర్రులో నోటీసు అందజేస్తున్న కార్మికులు



ప్రమాదకరంగా వంతెన

ప్రజాశక్తి-నందివాడ: మండలంలోని జనార్ధనపురం నుండి దిగువ గ్రామాలలోకి వెళ్లే ప్రధాన రహదారిలో నెహ్రాలి కాల్వపై ఉన్న వంతెనకు ఇరువైపులావున్న రక్షణగోడ కొంతకాలం కిందట విరిగిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు గ్రామంలోకి రాలేకపోతున్నాయి. గ్రామ ప్రధాన రహదారిపై వంతెన కావడంతో గ్రామంలోకి వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వంతెనపై నుంచే దిగువ గ్రామాలు తుమ్మలపల్లి, వెంకటరాఘవాపురం, పెదవిరివాడ, కుదరవల్లి,ఇలపర్రు, లక్ష్మీనరసింహాపురం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడుస్తోంది. దీనిపై ప్రయాణిస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెనకు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారానికై అధికారులు సహకరించాలని మండల ప్రజలు కోరారు.

నవలంకకు తరలివస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి-నాగాయలంక: స్కూళ్లకు వేసవి సెలవులు కావడంతో పిల్లలతో కలసి తల్లిదండ్రులు నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌ని, నది మధ్యలో ఉన్న నవలంకను పడవలో వెళ్లి సాయంకాలం వేళ సందర్శించి ప్రకృతి అందాలను వీక్షించి అమితానందాన్ని పొందుతున్నారు. నవలంకలో ఉన్న బెంచీల మీద తల్లిదండ్రులు కూర్చోగా, పిల్లలు ఇసుక తిన్నెలలో పిచ్చుక గూడులను కట్టుకుంటూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కొంత మంది పిల్లలు ఘాట్లో స్నానాలు చేస్తూ వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, పర్యాటక అధికారులు నవలంకను సందర్శించిన నేపథ్యంలో మరికొన్ని సదుపాయాలు కల్పించాలని యాత్రికులు కోరుతున్నారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

వేసవి ఎండలకు అల్లాడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ శిబిరాలు ఉపశమనం కల్పిస్తున్నాయి. మంగళవారం రామానాయుడు పేటలో సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవస్థానంలో తెలుగుదేశం జిల్లా బ్రాహ్మణ విభాగం సెక్రటరీ వేమూరి నాగ సాయి శర్మ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం టౌన్ జనసేన పార్టీ అధ్యక్షుడు గడ్డం రాజు మజ్జిగ పంపిణీ కి అవసరమైన ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. పాదచారులు మజ్జిగ స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు.

మోపిదేవి ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం పరిశీలించారు. దేవస్థానంలో ఉచిత అన్నదానం వంటశాలను పరిశీలించారు. భక్తులకు వడ్డించే ఆహార పదార్థాలు శుచి, శుభ్రతలతో నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా తయారు చేయించాలని స్పష్టం చేశారు. భక్తులకు అందించే సేవలు ఎప్పటికప్పుడు మెరుగుపర్చాలని సూచించారు. అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా దేవస్థాన కోనేరు ప్రాంగణంలో దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న భక్తుల వసతి సముదాయం గదులు, షాపింగ్ కాంప్లెక్స్ పనులు పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. పనులు జరుగుతున్న తీరును దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆయనకు వివరించారు. వారి వెంట దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి కాలంలో అనారోగ్యానికి గురికాకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అధిక మొత్తంలో వాటర్, కొబ్బరినీళ్లు, నిమ్మ నీరు తీసుకోవాలని అలాగే బయట తిరిగేటప్పుడు టోపీ ధరించాలని తెలిపారు. అనంతరం క్విజ్, ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాల అధికారిని టి వాణి తెలిపారు.



ప్రతిభావంతుల నిలయం శ్రీ రామకృష్ణ హైస్కూల్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్


ప్రణీత


కేశవ


ప్రసన్నలక్ష్మి

విద్యా రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం కలిగి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, వందలాది మంది విద్యార్థులు, మెరుగైన విద్యా ప్రమాణాలతో శ్రీ రామకష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మచిలీపట్నం నగరంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకుంది. కరస్పాండెంట్ చిత్తజల్లు రామకష్ణారావు పర్యవేక్షణలో మన సంస్కతి సాంప్రదాయాలు విద్యార్థులు ఆచరించేలా ప్రోత్సహించి వారికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు మొన్నటి పదవ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల నుంచి 81 మంది విద్యార్థులు ఫైనల్ పరీక్షలకు హాజరుకాగా 73 మంది ఉత్తీర్ణులయ్యారు. 28 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారు. ఇదే పాఠశాలలో చదువుకున్న వన్నంరెడ్డి రత్నారావు కుమార్తె సాయి ప్రణీత 600 కి గాను 588 మార్కులు సంపాదించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రత్నారావు వత్తి రీత్యా తాపీ మేస్త్రి పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఫీజులు కట్టి చేర్పించలేక రామకష్ణ స్కూలుకు పంపించానని మా అమ్మాయికి మంచి చదువు చెప్పి మంచి మార్కులు వచ్చేలా తీర్చి దిద్దిన పాఠశాల యాజమాన్యానికి రుణపడి ఉంటాను అంటున్నారు. నున్న అనంత వెంకట దుర్గాప్రసాద్ కుమార్తె ప్రసన్నలక్ష్మి 600 కి గాను 587 మార్కులు సంపాదించి ద్వితీయ స్థానంలో నిలిచింది దుర్గా ప్రసాద్ ఇడ్లీ బండి వద్ద రోజువారి వేతనంతో పని చేస్తాడు శనగల వీర వరప్రసాద్ కుమారుడు లక్ష్మీ శ్రీ సాయి కేశవ 600 మార్కులకు గాను 578 మార్కులు సంపాదించి మూడో స్థానంలో నిలిచాడు ఇతని తండ్రి వరప్రసాద్ వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నాడు రామకష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విజయ పరంపర లో సామాన్య అట్టడుగు పేద వర్గాల విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తమ ప్రతిభ చూపడం గమనార్హం రామకష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బాలికలకు మచిలీపట్నంలోని ఆర్కే జూనియర్ కళాశాలలో రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సు విద్యను ఉచితంగా అందిస్తున్నట్లు ఆర్కే విద్యా సంస్థల అధినేత బండి రామకష్ణ ప్రకటించారు. ఇంటర్మీడియట్ లో ఉచిత ప్రవేశం పొందిన రామకష్ణ స్కూల్ విద్యార్థి నున్న ప్రసన్నలక్ష్మి తెలుగులో వందకు వంద లెక్కల సబ్జెక్టులో 100కు 100 సోషల్ సబ్జెక్టులో 100కు 100 సాధించింది రామకష్ణ హై స్కూల్ విద్యార్థులు ఐదుగురు తెలుగులో 100కు 100 మార్కులు సాధించడం పట్ల మాతభాషపై ఈ పాఠశాల విద్యార్థులకు ఉన్న పట్టును తెలియజేస్తోంది. రామకష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి ప్రజాశక్తితో మాట్లాడుతూ తమ పాఠశాలలో ఎల్కేజీ నుంచి పదో తరగతి వరకు 700 నుంచి 800 వరకు విద్యార్థులు ఉంటారని, విశాలమైన ప్రాంగణంలో సుశిక్షితులైన ఉపాధ్యాయ సిబ్బంది అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమమైన విద్యాబోధన అందిస్తారని తెలిపారు.



విఎస్ సెయింట్ జాన్స్ విజయదుందుభి

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక విఎస్ సెయింట్ జాన్స్ విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పదో తరగతి విద్యార్థిని సిహెచ్.శశిమంజూష 491, కె.లాస్య 490, కె.జోన పౌలిన్, కె ప్రద్యుమ్న 481 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పరీక్షకు 220 మంది హాజరు కాగా వారిలో 103 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారన్నారు. ప్లస్ 2 విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను లోకల్ సుపియర్ రెవ.బ్రదర్ బాలశౌరి, రెవ.బ్రదర్ జిమ్మీ కురియోకోస్, రెవ.బ్రదర్. భల్లా జోసఫ్, రెవ. బ్రదర్. జయబాలన్ అభినందించారు.


మంజూష


లాస్య

గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణ


కంచికచర్ల గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవివి జ్ఞాన తరగతులు నిర్వహించారు. క్రాఫ్ట్ మాస్టర్ ఎం.కనకారావు క్రాఫ్ట్ వర్క్ చేయించారు. డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు డ్రాయింగ్ నేర్పించారు. కంచికచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు మాస్టర్ ఎస్‌కె ఇస్మాయిల్ విద్యార్థులకు కరెంట్ అఫైర్స్‌ని వివరించారు. విద్యార్థులు కొద్దిసేపు పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

మైలవరం : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మైలవరం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గణిత శాస్త్రంలో బోధన పద్ధతుల గురించి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఈ ప్రసాద్‌రావు అవగాహన కల్పించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సభలు సమావేశాలు జరిగేటప్పుడు వ్యక్తులను లెక్కించటం, రెండు అంకెల సంఖ్యల సంకలన, వ్యవకలనాలను తప్పు లేకుండా చేయటం, పెద్ద సంఖ్యలను, చిన్న సంఖ్యలను వేల స్థానం వరకు గుణించటం, భాగించటం గురించి విపులంగా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు విద్యార్థులు సర్వసాధారణంగా ప్రాథమిక స్థాయిలో కచ్చితంగా గణించటం అనేది తమ శక్తికి మించిన పనిగా భావిస్తున్నారని అదే భావన వృక్షంగా పెరిగి పెద్దదై ఉన్నత తరగతుల్లో వారి ప్రగతికి అవరోధంగా ఉంటుందన్నారు. వేగం కచ్చితత్వం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటాయి కాబట్టి కచ్చితత్వం అనేది బాల్య వ్యవస్థ నుంచి అలవాటు చేస్తే వేగం అలవాటవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో మంచి నైపుణ్యంతో కూడిన విద్యను, వివిధ రకాల పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు విద్యార్థులకు కరాటే నేర్పించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు చెస్, యోగా స్పాంజ్‌తో బొమ్మలు తయారీ విధానాన్ని నేర్పించినట్లు గ్రంథాలయ అధికారి కె.పద్మావతి తెలిపారు.

జగ్గయ్యపేట : పట్టణంలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుండి మొదటిగా పుస్తక పఠనం చేయించి తదుపరి తెలుగు ఉపాధ్యాయులు శ్రీమతి ప్రేమలత శతక పద్యాల చెప్పి వారితో చెప్పించడం, చదివించడం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు వినోద్ బాబు స్పోకెన్ ఇంగ్లీష్ లో వెర్బ్స్ నేర్పించినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని శ్రీమతి ఆలేటి ప్రభ, సిబ్బంది జె శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.


మైలవరం గ్రంథాలయంలో విద్యార్థులకు గణిత శాస్త్రంలో బోధనా పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ప్రసాద్‌రావు


తిరువూరులో కరాటే నేర్పుతున్న ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు


జగ్గయ్యపేటలో కథలు చెబుతున్న విద్యార్థులు

టిడిపి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలో టిడిపి సంస్థాగత గ్రామ కమిటీ ఎన్నికలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత వారం రోజులుగా మండలంలో ఆరు గ్రామాల్లో గ్రామ కమిటీ ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని, రాబోయే వారం రోజుల్లో మొత్తం గ్రామ కమిటీ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి లోకేష్ బాబు ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

అక్రమ కేసులో అరెస్టయిన వైసిపి కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి - వత్సవాయి : అక్రమంగా తప్పుడు కేసులో బాధితులై సబ్‌జైలు నుంచి వాయిదా నిమిత్తం జగ్గయ్యపేట కోర్టుకు వచ్చిన పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామం వైసిపి కార్యకర్త మొరంపుల దేవదాస్‌ను, కుటుంబ సభ్యులను నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిపి సంఘాల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, ప్రముఖ న్యాయవాది సత్య శ్రీనివాసరావు, ఎంపిటిసి కేసర లోకేష్, నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షన్స్ విభాగ అధ్యక్షులు దర్శి వెంకటేశ్వర్లు, భీమవరం నాయకులు రంగారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మన్నె అప్పారావు, పట్టణ యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల కలిగిన పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి గ్రామంలో 0 – 18 సంవత్సరాల వయసు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు సహిత విద్యా వనరుల ఉపాధ్యాయులు డి.ఉదయ లక్ష్మి సర్వేను నిర్వహించారు. మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన (వికలాంగ) పిల్లల పాఠశాల నమోదు కార్యక్రమాన్ని 13 మే 2025 నుండి ప్రారంభించారు. ఈ సర్వే కార్యక్రమం జూన్ 9 వరకు జరుగనంది. మండలంలో సహిత విద్య వనరుల ఉపాధ్యాయులు డి.ఉదయలక్ష్మి, డి.జానకి ఈ సర్వే ద్వారా వినికిడి లోపం, మాటలు రాకపోవడం, అంధత్వం, బుద్ధిమాంద్యత, ఆటిజం వంటి 21 రకాల వైకల్యాలు గల పిల్లలను గుర్తించి భవితా సెంటర్ లో లేదా పాఠశాలలో చేర్పిస్తున్నారు. వైకల్యాన్ని అధిగమించే నిమిత్తం అవసరమైన ఉపకరణాలు, బోధన, అభ్యసన సామాగ్రిని అసెస్మెంట్ క్యాంపుల నిర్వహణ ద్వారా అందజేస్తున్నారు. అంగన్వాడీ, ఎఎన్‌ఎం, ఆశ, సచివాలయ సిబ్బంది సాయంతో ఇంటింటికి సర్వేను నిర్వహిస్తున్నారు. జిల్లా మొత్తం మీద ఇలాంటి 20 భవిత సెంటర్లు కలవని సహిత విద్యా వనరుల ఉపాధ్యాయులు ఉదయలక్ష్మీ తెలిపారు. **ఇబ్రహీంపట్నం :** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ప్రత్యేక నమోదు (డిఆర్ఐ) భాగంగా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్, ప్రత్యేక ఉపాధ్యాయులు చంద్రావతి మంగళవారం గుంటుపల్లిలో పాపని గుర్తించారు. ఆ పాప వాళ్ళ ఇంటికి వెళ్లి ఆ తల్లిదండ్రులతో పాప గురించి అన్ని విషయాలు తెలుసుకొని ఆ పాపను గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో చేర్పించడం వల్ల విద్యార్థికి వచ్చే ప్రయోజనాలు, అలవెన్సులు ప్రభుత్వం అందించే విధానాన్ని వివరించారు.


ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్న విద్యా వనరుల ఉపాధ్యాయులు ఉదయ లక్ష్మి


ఇబ్రహీంపట్నంలో...

సార్వత్రిక సమ్మెపై విస్తృత ప్రచారం



విజయవాడలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయా యూనియన్ల జిల్లా నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : కార్మికుల మెడకు ఉరితాళ్లుగా తయారయిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పలు కేంద్ర కార్మిక సంఘాల జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా యూనియన్ల జిల్లా నాయకులు మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేసేందుకు వివిధ రూపాల్లో ప్రచారాన్ని విస్తృత రూపంలో నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు, కార్యదర్శి ఇ.వి.నారాయణ, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు మునిశంకర్, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు లక్ష్మణరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ, ఏఐటీయూసీ సిహెచ్ వి రమణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి వీరులపాడు :** సిఐటియు మండల సదస్సు మంగళవారం నాడు పి.సుబ్బమ్మ అధ్యక్షతన జుజ్జూరులో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి, ఎ.కమల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీరులపాడు మండల కార్యదర్శి లాల్ మహమ్మద్ గౌస్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు సాయమ్మ, ముద్దం బి, కష్ణవేణి, మధ్యాహ్నం భోజనం నాయకులు సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** ఉపాధి హామీ పరిరక్షణ కోసం సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. అంబారుపేటలో వ్యవసాయ కార్మిక సంఘం బృందం ఉపాధి పని ప్రాంతానికి వెళ్లి ఉపాధి కార్మికుల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాసిం, మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.సుధాకర్ కరపత్రాలు విడుదల చేశారు. **చందర్లపాడు :** మండలంలోని విభరితలపాడు బొడ్రాయి సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఎల్.అనురాధ, జి.కుమారి, ఈదర సరోజిని పాల్గొన్నారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట స్థానిక తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం సిఐటియు మండల సదస్సు సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సును ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.నాగరాజు, సిఐటియు జిల్లా నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం రైతు సంఘం మండల నాయకులు పులిబల్ల ఏడుకొండలు గెద్దల రామకష్ణ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ లీడర్ నిర్మల ఆశా వర్కర్ యూనియన్ మండల అధ్యక్షులు చిలకమ్మా, విఆర్ఏ సంఘం నాయకులు భాస్కరరావు, రిక్షా వర్కర్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు ఆశ వర్కర్ యూనియన్ నాయకులు పద్మ విజయ కుమారి రాణి సుహాసిని బేగం చిన్నమ్మ వరలక్ష్మి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. సోమవారం నందిగామ సుందరయ్య భవన్‌లో నందిగామ మండలం ఎపి మధ్యాహ్న భోజనం పథకం వర్కర్ సీనియర్ నందిగామ కమిటీ సమావేశం జరిగింది. నందిగామ మండల మధ్యాహ్నం భోజన ఏజెన్సీ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు అంధూరి సుశీల అధ్యక్షతన జరిగింది. **కంచికచర్ల :** సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులను కలిసి సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఆయా కంపెనీలు, షోరూం లు, పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా రంగాల కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. సిఐటియు మండలం కార్యదర్శి బెజ్జం భూషణం పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనకు ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) సభ్యులు సమ్మె నోటీసులు, వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కొండపల్లి ప్రెసిడెంట్ బి.అప్పారావు, సెక్రటరీ జి.సురేష్, వైస్ ప్రెసిడెంట్ దేవుళ్ళు, రమణ, కృష్ణపాల్గొన్నారు.


రెడ్డిగూడెంలో కరపత్రాలు విడుదల చేస్తూ...


నందిగామలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న కళ్యాణ్, తదితరులు


వీరులపాడులో మాట్లాడుతున్న కమల


ఇబ్రహీంపట్నంలో సమ్మె నోటీసు అందజేస్తూ...

ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు



మాట్లాడుతున్న నరసింహారావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

ప్రజల సమస్యలను పరిష్కరించకుండా దేశంలో జరుగుతున్న సంఘటనలను ప్రభుత్వాలు తమకి ఆనుకూలంగా మలుచుకుని ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టి కాలక్షేపం చేస్తున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు విమర్శించారు. మంగళవారం సిఐటియు నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో కార్మిక సంఘాల సదస్సు జరిగింది. ఈ సదస్సులో నరసింహారావు మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులతో పర్యాటకులు చనిపోతే కేంద్ర ప్రభుత్వం వారి దత్తత పుత్రులు ముస్లింలను తీవ్రవాదులుగా చూపిస్తూ హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని ప్రధాని మోడీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన సందర్భంలో పాకిస్తాన్‌తో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల గురించి వారి కుటుంబాల గురించి మాట్లాడకపోవడం మోడీ చిత్తశుద్ధిని బహిర్గతం చేసిందన్నారు. ఈ నెల 20 తేదీన దేశవ్యాప్తంగా సమ్మెలో కోట్ల మంది కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. ఓ పక్క నిత్యవసర సరుకులు రోజురోజుకీ పెరుగుతున్నాయని, కార్మికుల వేతనాలు మాత్రం పెరగడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద కోట్లు సంపాదించిన కార్పొరేట్ అధిపతుల సంఖ్య రెట్టింపు అయ్యిందన్నారు. సమ్మెకు సన్నాహకంగా మచిలీపట్నంలో ఈ నెల 17న సాయంత్రం చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కె.వి గోపాలరావు, సిఐటియూ మండల కార్యదర్శి చిరువోలు జయరావు, జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పామర్తి నాగయ్య, ఏఐటియుసి నాయకులు ఒంటిపులి లక్ష్మణరావు, మున్సిపల్ కార్మికులు సంఘం నాయకులు ఎర్రంశెట్టి ఈశ్వరరావు, అంగన్వాడి వర్కర్స్ జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి పాల్గొన్నారు.



టిడ్కో కాలనీవాసుల నిరసన

ప్రజాశక్తి-గుడివాడ: టిడ్కో కాలనీ ఋణమాఫి చేసి సమస్యలు పరిష్కరించాలని టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. కాలనీలోని సి36 బ్లాక్, సి86, బి21, సి136, సి126, సి105, పంచవటి కాలనీ, సి6, సి41 తదితర చోట్ల 250 మంది లబ్దిదారులు ధర్నాలు నిర్వహించి నిరసన తెలిపారు. అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు సంబంగి రంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము యిచ్చిన హామి మేరకు ఋణమాఫి చేయాలన్నారు. మౌళిక వసతులను కల్పించాలని, ఉప్పునీటి బోరులు వేయాలని, మంచినీటిని ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి అందించాలని వంటి డిమాండ్‌లను నేరవేర్చాలన్నారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాపిత కార్మికుల సమ్మె, గ్రామీణ హర్తాళ్లకు మద్దతుగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ సభ్యులు మేరమ్మ, ఎస్.ఇందిర, ఆర్.శివారాంప్రసాద్, సహాయ కార్యదర్సులు ఆర్.గణేష్, షేక్ సుబాని, ఎస్.రాంబాబు, అప్పలనాయుడు, శాంతారాం, టి. అమ్మాజీ, గాయత్రి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నెలకొల్పిన స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్ కోర్స్‌లో శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు బిఎస్ఆర్ సుజిత్ తెలిపారు. ఇది మూడు నెలల కోర్స్ అని, ఈ కోర్సుకు కేవలం ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాసైన లేదా తప్పినా అర్హులన్నారు. 16 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల్లోపు ఉండాలని తెలిపారు. శిక్షణ పూర్తిగా ఉచితమని, శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కోర్సు గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు చూపుతుందని పేర్కొన్నారు.

రైతుల్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కంకిపాడు: ధాన్యాన్ని ప్రభుత్వమే రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుందని, గిట్టుబాటు ధర లేక రైతులు భారీగా నష్టపోతున్నారని, రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్మి భారీగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, పి.దుర్గారావు, వి.శివశంకర్ పాల్గొన్నారు



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల: మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీపై నాణ్యత ప్రమాణాలు గల పచ్చి రొట్ట విత్తనాలు (జీలుగ, పిల్లిపెసర మరియు జనుము)ను పంపిణీ చేశారు. ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఇవ్వటం జరుగుతుందని ఏవో మురళీకృష్ణ తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకలుతో ఆయా రైతు సేవ కేంద్రంను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాకుళం సర్పంచ్ ముప్పానేని రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, దేవరకోట సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు, బుజ్జి, మల్లంపల్లి సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వర రావు, బండి పరాత్పరరావు పాల్గొన్నారు.

క్రీడా వసతుల కల్పనకు కృషి : యార్లగడ్డ




పనులకు శంకుస్థాపన చేస్తున్న యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: క్రీడాకారులకు, యువత కోసం గన్నవరం నియోజకవర్గంలో అన్ని రకాల క్రీడావసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం రైల్వే స్టేషన్ రోడ్ లోని ప్రభుత్వభూమిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రికెట్ బాక్స్, స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టుల నిర్మాణ పనులకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడా వసతులు కల్పిస్తే వారిలో దాగున్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని తద్వారా జాతీయంగా అంతర్జాతీయంగా క్రీడాకారులు తయారవుతారని పేర్కొన్నారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గన్నవరం నియోజకవర్గంలోని ప్రధాన గ్రామాల్లో క్రికెట్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు షటిల్ వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ముందుగా గన్నవరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇక్కడ వీటిని ఏర్పాటు చేస్తున్నామని 40 రోజుల్లో నిర్మాణం పూర్తి చేసుకొని యువతకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇక్కడ డిమాండ్ ను బట్టి జాతీయ రహదారిపై మరదలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. రామవరప్పాడు, బాపులపాడు గ్రామాల్లోనూ ఇదేవిధంగా కోర్టులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడపాటి తులసి మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, కొమ్మరాజు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ పూర్ణిమ వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుండి బంటుమిల్లి రోడ్డులోని బౌద్ధ స్తూపం వరకు చేపట్టిన పాదయాత్రను జాతీయ జెండా జండా ఊపి స్టేడియం కమిటీ అధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. బుద్ధం శరణం గచ్ఛామి అని నినాదాలు, జోహార్ అమరవీరులకు నివాళ్ళులర్పిస్తూ పాదయాత్ర సాగింది ఈ కార్యక్రమంలో తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకష్ణ(చంటి), పిరమిడ్ రాజకుమారి, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షులు పొంగులేటి జయరాజు, పిన్నమనేని వేణుగోపాలరావు, జిల్లా బౌద్ధ డైరెక్టర్ రామకష్ణ, దినకర్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో క్లబ్ మేనేజింగ్ ట్రస్టి లింగం చిట్టిబాబు మరదలు నాదెండ్ల వెంకట కష్ణవేణి జ్ఞాపకార్థం మంగళవారం స్థానిక కెనరా బ్యాంక్ ఎదురుగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు కోన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, కోశాధికారి తమ్మినేని రామ్మోహన్రావు పాల్గొన్నారు.



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి వెంకటేశ్వరరావు, నాగరత్నం దంపతుల జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దండమూడి సీతారాంస్వామి, చైర్మన్ వేణుగోపాల్‌రావు, నిమ్మకూరి జలమయ్య, మానవతా సభ్యులు బచ్చు రాధాయిఔష్ణ, ఘంటసాల వెంకటేశ్వరరావు, మెరుగుమాల బ్రహ్మయ్య, గుడివాడ శాఖ అధ్యక్షులు అన్నపురెడ్డి గోపిరెడ్డి పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం సైనికులకు మద్దతుగా మోపిదేవి పురవీధుల్లో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ పెహల్గామ్ ఘటనతో దేశం దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ యువతలో దేశ భక్తి ప్రేరేపించేందుకు పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, పెడన నియోజకవర్గ ఇంచార్జి పంచకర్ల సురేష్, పామర్రు నియోజకవర్గ ఇంచార్జి తాడిశెట్టి నరేష్, ఏపీఐఐసీ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కురుమద్దాలిలో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు ఎమ్మెల్యే వరల కుమార్ రాజా మంగళవారం మండల పరిధిలోని కురుమద్దాలిలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని పరిశీలించారు. కురుమద్దాలి గ్రామంలో ప్రగతి పదంలో పామర్రు అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి పల్లె నిద్ర చేసి మంగళవారం ఉదయం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తడి పొడి చెత్త సేకరణలో పాల్గొని డ్రైనేజీ క్లీనింగ్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి ఎన్ వి అంజనాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హార్టికల్చర్ డెవలప్మెంట్ లో భాగంగా స్థానిక శ్యామ్ ఆక్వా లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ సందర్శించి అనంతరం అక్కడి ఆవరణలో పామాయిల్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపచ్చదనం పరిశుభ్రత అభివద్ధి భాగంగా ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలోపామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, శ్యామ్ ఆక్వా సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో 100రోజుల ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్నపనిలో కూలీలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిచేస్తున్న ప్రాంతంలో కూలీలకు సరైన మౌలికవసతులు కల్పించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ



ఎంపిని కలిసిన దుర్గగుడి ఇఒ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయ వాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)ని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన ఇఒ వి.కె.శీనానాయక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి ప్రసాదం అందించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులు, యాత్రికుల సౌకర్యార్థం చేపడుతున్న చర్యల గురించి కార్యనిర్వాహణాధికారి పార్లమెంట్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ పథకం ద్వారా ఇంద్రకీలాద్రి అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాల గురించి, కేంద్ర మంత్రులను సంప్రదిస్తున్న విషయాల గురించి ఎంపి శివనాథ్ (చిన్ని) వివరించారు.

కుక్కల దాడితో చూడి గేదె మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఎన్జీవో కాలనీ (పావురాల గుట్ట)లో పాడి పశువుల యజమాని పాటిబండ్ల నరేంద్రకు చెందిన చూడిగేదెపై ఆదివారం కుక్క దాడి చేసి కరిచిందని దానిని వెంటబడి తరిమి కొట్టించారు. కుక్క కరవడంతో చూడిగేదె (రూ.60 వేల విలువైన) విష పూరితమై మృతి చెందిందని యజమాని తెలిపారు. ఇప్పటి వరకు ఆ యజమానికి చెందిన 4 గేదెలు చనిపోయి నష్టం జరిగిందని కుక్కలు కరచి చనిపోయిన గేదెలకు ఇన్సూరెన్స్ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల సంఖ్య పెరిగి, బహిరంగంగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయనీ కుక్కకాటు కారణంగా చనిపోయిన గేదెల యజమాని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ శాస్త్ర చికిత్స చేసి, వీధుల్లో విచ్చలవిడిగా సంచరించకుండా నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలల సంరక్షణలో అలసత్వం వద్దు

హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి స్కీమ్‌లపై సమీక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాలల పరిరక్షణ కార్యక్రమాల్లో బాలల సంరక్షణ కేంద్రాలు అలసత్యం వహిస్తే సహించేదిలేదన్నారు. పిల్లలు దత్తత లీగల్‌గా జరగాలన్నారు. బాల్య వివాహాలు నిషేధించటంలో సంబంధిత అధికారులను భాగ్యస్వాములను చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు, ఎయిడ్స్ వ్యాధిగ్రాస్తుల పిల్లలకు మిషన్ వాత్సల్య గైడెన్స్ ఆధారంగా ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. లైసెన్స్ అర్హత కలిగిన బాలల సంరక్షణ కేంద్రాలు మాత్రమే నడపాలని డీపీవో ను ఆదేశించారు. రిజిస్టర్లు, డాక్యుమెంటేషన్, రికార్డులు భద్రపర్చుకోవాలని సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ సువార్త, రవి భార్గవ్, డిపిఒ జ్యోతి, సిడిపిఒ మంగమ్మ, జోష్న, పుష్పలత, సత్యవతి, కృష్ణ కుమారి, లక్ష్మి భార్గవి, డీసీపీయు, ఓ ఎస్ సి, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, శిశు గృహ, బాలసదన్, బాలల సంరక్షణ కేంద్రాల సిబ్బంది తదితరుల హాజరయ్యారు.



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

రక్తదానం మానవత్వానికి మరో రూపం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రక్తదానం మానవత్వానికి మరో రూపమని ప్రాణాపాయి స్థితిలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించడం ప్రాణాలను కాపాడడం మరో జన్మనివ్వడమేనని, రక్తదానం చేయడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు తొలగించి రక్తదానానికి ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం అభినందనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక సూర్యరావు పేట నక్కలరోడ్డులోని శ్రీధర్ కోచింగ్ సెంటర్ లో ఆసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మోగా రక్తదానం శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రక్తదానం చేయడం మానవత్వానికి మరో రూపంగా భావించాలన్నారు. కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే ఒక మానవతావాది రక్తంలో ఉండే గ్రూపులను వర్గీకరించి ఉండకపోతే ప్రపంచంలో ఇప్పటికీ రక్తమార్పిడి కారణంగా మరణాలు సంభవించేవన్నారు. రాష్ట్రంలో అనేక మంది రక్త హీనతతో బాధపడుతున్నారని సుమారు 6 వేల మందికి పైగా తలసీమియా వ్యాధికి గురికావడం జరిగిందని వీరి ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్త మార్పిండి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చునని, జీవిత కాలంలో ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునని అన్నారు. కొత్త యువత కూడా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలలో పాల్గొనేలా స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కొమ్మూరి శ్రీధర్, సీతారామిరెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న మంత్రి సత్యకుమార్

సౌత్ ఏషియన్ గేమ్స్‌లో రమణయ్య సత్తా


లాంగ్ జంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రోలో 3 బంగారు పతకాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్ ఇండో నేపాల్‌లోని రంగస్థల స్టేడియం పోక్రాలో ఈనెల 4 తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగిన పోటీల్లో గంపలగూడెం మండలం పెనుగలను గ్రామానికి చెందిన రాళ్లచెర్ల రమణయ్య పాల్గొని చత్తా చాటారు. రమణయ్య కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో నివాసముంటూ నగరానికి చెందిన అరబిందో జూనియర్ కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్నట్లు సమాచారం. పైన తెలిపిన క్రీడల్లో ఆసక్తి కలిగిన రమణయ్య ఎంతో శ్రమకోర్చి సాధన చేశారు. ఈ క్రీడల్లో పాల్గొన్న రమణయ్య మూడు బంగారు పథకాలు సాధించడం విశేషం. ఈ పోటీల్లో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, దేశాలు పాల్గొన్నాయి. ఇండియా నుండి 45 సంవత్సరాల విభాగంలో రమణయ్య లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రోలో పాల్గొని బంగారు పతకాలు సాధించడం విశేషం. రమణయ్య గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పథకాలు సాధించినట్లు సమీప బంధువులు తెలిపారు. ఇంటర్నేషనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలంటే పట్టుదల, కటోర సాధన అత్యంత అవసరం. ఇంటర్నేషనల్ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటే మరింత ముందుకు పోనున్నట్లు రమణయ్య చెప్పారు. ఈ సందర్భంగా రమణయ్యను భవిష్యత్తులో మరెన్నో పథకాలు సాధించాలని క్రీడాకారులు కాంక్షించారు.



'ఆయుష్' వార్సికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని ఆయుష్ హాస్పిటల్ 13వ వార్సికోత్సవ వేడుకలు రింగ్ రోడ్డు వద్ద గల హాస్పిటల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2012లో ఆయుష్ హాస్పిటల్ ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుండి నేటి వరకు ఎంతోమందికి వైద్య సేవలను అందిస్తూ అందరికీ చేరువైనట్లు తెలిపారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్ బాబు మాట్లాడుతూ ఆయుష్ హాస్పిటల్ ఎంతో మందికి వైద్య సేవలను అందిస్తూనే పలు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు కుట్టు మిషన్లు అందించడంతో పాటు పోలీస్ శాఖకు సి సి కెమెరాలు, వరద బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు, ఉచితంగా వాక్సినేషన్ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. హాస్పిటల్ వార్సికోత్సవం సందర్భంగా వర్టిగో లాబ్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ పి. ఎస్.ఎస్.చౌదరి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. ఎల్. వి.ప్రసాద్ పలువురు వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


నూతనంగా ప్రారంభించిన ల్యాబ్‌లో వైద్యులు

నృత్య కళాకారిణికి గిన్నిస్ రికార్డ్

ఎంపి అభినందన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో కళా వైభవం పేరిట 4,300 మంది నృత్య కళాకారిణులతో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకున్న నృత్యకళాకారిణి ప్రణీతారెడ్డి (14)ని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ ఆధ్వర్యంలో ఎంపి మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రణితారెడ్డి తను గిన్నిస్ బుక్ వరల్డ్ నుంచి అందుకున్న మెడల్, ప్రశంసాపత్రాన్ని ఎంపి కేశినేని శివనాథ్‌కి చూపించింది. ప్రణీతారెడ్డి అభిరుచి గమనించి కూచిపూడి నేర్పించిన ప్రణీత రెడ్డి తల్లిదండ్రులు దాసరి శివాజీ రెడ్డి, నాగమణిలను ఎంపి కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంత చిన్న వయస్సులోనే 1000 పైగా ప్రదర్శనలు ఇవ్వటం ప్రణీతా రెడ్డికి నృత్యంపై ఉన్న ఆసక్తి తెలియపరుస్తుందన్నారు.



వేసవిలో పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వేసవి సందర్భంగా మంచి పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలనీ పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆరోగ్యం పోషకాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను నియంత్రిత భాగాల్లో తీసుకోవడం ద్వారా, ఆహారాన్ని ఆస్వాదిస్తూనే ఆరోగ్య లక్ష్యాలతో ట్రాక్‌లో ఉండటం సాధ్యమవుతుందని వివరించారు. గుప్పెడు బాదం, మూంగ్ దాల్ చిల్లా, మొలకలు భేల్, దోసకాయ సలాడ్‌తో పనీర్ క్యూబ్స్, వేయించిన శనగలు ఆరోగ్యకరమైన ఆహారంగా తీసుకోవచ్చని అన్నారు.

ప్రీమియం లెదర్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాదరక్షల మార్కెట్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, రేర్'జ్ బై రేర్ రాబిట్ తమ మొదటి ఓపెన్ ఫుట్‌వేర్ కేటగిరీ ప్రీమియం లెదర్ స్లిప్-ఆన్స్ ఫర్ మెన్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇన్చార్జి వై.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. పాద రక్షలలో బేజ్ (తేలికపాటి గోధుమ రంగు), బోర్డో (గాఢ ఎరుపు), సిల్వర్ (వెండి రంగు), బ్లాక్, శాండ్ (ఇసుక రంగు), టాన్ (లేత కాఫీ రంగు), నేవీ (గాఢ నీలం) వంటి అనేక రంగుల్లో అందుబాటులో ఉన్న ఐదు ప్రత్యేక స్టైల్‌లు ఉంటాయని తెలిపారు. ఇవి నిజమైన లెదర్‌తో తయారు చేయబడి, ప్రత్యేకంగా రూపొందించిన ఎర్గనామిక్ సోల్స్‌తో వస్తాయన్నారు. ఈ స్లిప్పర్లు రేర్'జ్‌కు ప్రత్యేకత కలిగిన డిజైన్ శైలిని, ప్రతి రోజు ఉపయోగించే క్యాజువల్ లైఫ్ స్టైల్‌కు అవసరమైన సౌకర్యంతో సమ్మిళితంగా అందిస్తాయని అన్నారు.

నందిగామలో హలో చైర్మన్‌కు స్పందన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో ఏర్పాటు చేసిన 'హలో చైర్మన్'కు మంగళవారం స్పందన లభించింది. నందిగామ నుండి మధిర వైపు వెళ్ళు రోడ్డులో భారీగా కొబ్బరి బొండాలు, చెత్త రాశులుగా పోయడం వల్ల ద్విచక్ర వాహనదారులు, బాటసారులు దుర్వాసన భరించలేక పోతున్నామని నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకురాగానే చైర్ పర్సన్ తక్షణమే స్పందించారు. మంగళవారం ఉదయం దగ్గరుండి దానిని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి మాట్లాడుతూ ఎవరైనా అనధికారికంగా ఇక్కడ చెత్త వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చెత్తను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న దృశ్యం